


"మీ గన్స్ లోడ్ చేయండి అడవి ముంగిటలో జీప్ నాపిన సబ్‌యిన్స్‌పెక్టర్ – వెనుక కూచున్న పోలీసులతో అన్నాడు

ఎదురుగా కనిపించే అడవి అందాలను అనుభవిస్తున్న నేను – వులిక్కిపడ్డాను మనసున భయం బుడగేసి పగిలింది చూపు వొంకలొంకలుగా తిరిగి ఎస్ ఐ పైనిలిచింది

అతనూ – నాపాటి వయసున్నవాడే! నాకంటే బలంగానూ ఎత్తుగానూ వున్నాడు మచ్చల ముహం బొద్దు మీసాలు చూపు మృదువుగా లేదు స్వరంలానే అదీ కటువుగా వుంది జీప్ దిగి సూరీడుకు అరచేతి నడ్డంపెట్టి దూర దూరాల్లోకి చూస్తూ గన్ లాక్ చేయకండి పొజిషన్‌లో కూచోండి అన్నాడా ఖాకీ షహెనుబావుడు

నా అయోమయం నా బట్టతలపై నాట్యమాడుతూంది ఏదీ అర్థంగావడంలేదు గతంలో ఎన్నో సార్లు ఎన్నికల విదులు నిర్వహించాను ఏ నాడూ యిలా అయోమయం – అనుభవంలోకి రాలేదు పోలింగ్ ప్రశాంతంగా జరగడంకోసం పోలీసులుంటారుగాని వారు తోలుబొమ్మల్లాటి వారే! పగటివేషగాళ్ళలా భేషజాలుపోవడం తప్ప ఈ గన్నూ లోడ్డూ పొజిషన్నూ నేనెరగ!

పోలీసుల మొహాల్లో హుషారేం తొంగిచూడడం లేదు అలాగని ఏకాదశి మొహాల్తో నీరసంగానూ కన్పించడంలేదు విద్యుత్ సాయంతో నడిచే యంత్రాల్లా – ఎస్ ఐ ఆదేశాలను అనుసరిస్తున్న చేతులు గాజు కళ్ళ చూపులు!

పోలీసులు ప్రక్కగా వొదిగి కూచున్న నా పోలింగ్ సిబ్బంది మొహాల్లో చెప్పలేనంత యిబ్బంది భయాన్ని నములుతూ నన్నూ ఎస్ ఐ నీ మార్చి మార్చి చూస్తున్నారు ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా నా నుండి వారేదో అభయం కోరుతున్నట్టుగా ఆ దీనమైన చూపులు!

కాని నేనేమని అభయం యివ్వగలను? నాకే గుండెలు నొక్కేస్తున్నంత భయంగా వుంది

ఎస్ ఐ తన పిస్టల్ లోడ్‌చేసుకొంటూ ఓ సారి పోలీసులకేసి చూసి చూపు మరల్చి డ్రైవర్‌తో పోర్‌వీల్ కండిషన్‌లో వుందా? జాగర్త రోడ్ కాదిది సంగరేణి అడవి అంటే – రాడికల్స్ రాజ్యం ఇంజన్ ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపకు అన్నాడు అంటూ నాకేసి అదోలా చూశాడు

నా శరీరంలో వణుకు ప్రారంభమయింది బేలచూపులతో గువ్వలా వొదుగుతూ డ్రయివర్‌కేసి దీనంగా చూశాను

డ్రయివర్ యువకుడు అతని నున్నని చెంపమీద పొడవాటి గాటు – మన ప్రజాస్వామ్యం మీద మన ఘనతవహించిన రాజకీయ నాయకుని అడుగులా అసహ్యంగా వుంది క్రమశిక్షణకు దూరంగా బతుకుతున్న అతని తల – చిందరవందరగా ఎన్నికల రంగంలో మన ప్రియమైన అభ్యర్థుల పెడబుద్ధులకు ప్రతీకగా వుంది సినిమావాళ్ళ కీచకుడు వాడి పారేసిన రౌడీ మార్కు బనీనూ పాంటూ అతన్ని దూరాన్నుంచి చూస్తే – మరింత దూరంగా పోవాలనిపిస్తుంది పలుకరించి చూస్తే – వెన్నతిన్న అనుభూతి మిగులుతుంది వినయంగా తలాడిస్తూ ఎస్ ఐ తో నాకీ దార్లు తెలుసు సాబ్ ట్రయిబల్ ఆఫీసర్‌గారితో ఓసారి అడివికొమ్ము కు సుత ఎల్లిన అన్నాడు

అడవికొమ్ము సంగతలావుంచు ముందీ అడివి దాటు వాళ్ళసలే బరితెగించిన పోరగాళ్ళు అంటూ సూరీడు చూపుతో చుట్టూ చూశాడు ఎస్ ఐ

దూరాన –

అడవి అదురుకునేలా ఏదో అరుపు! పక్షో జంతువో లేక రెండూ కలిసో తెలియలేదు నా శరీరంలోంచి చెమట చినుకులు రాలి పడుతున్నాయి పెదాలపైతడి పొడిగా వుంది నా సిబ్బంది మొహాల్లోనూ కళ ఖరీదైపోయింది పోలీసుల కేసి చూసాను ఖాకీలో కళని కనిపెట్టడం కష్టమనిపించింది వారెంతో వున్నతంగా మా రక్షణ దుర్గాల్లా అనిపించారు

రడీ ఎస్ ఐ జీప్‌లో కూచుంటూ అని చటుక్కున నాపై చూపేసి బాలెట్‌పేపర్స్ అన్నాడు

ఇవిగో నా వడిలో బిడ్డలా పొదవి పట్టుకొన్న సంచిని చూపిస్తూ అన్నాను అన్నాననేగాని శబ్దం ఎదవినైనా తాకలేదు

ఎస్ ఐ కనురెప్పల కదలికతో జీప్ కదిలింది

జీప్‌తో పాటు ఎర్రని దుమ్ము మా వెన్నంటి కదులుతూంది

దారి – దారిలా లేదు దారి తప్పిన మన ప్రజాస్వామ్యంలా వుంది

దారి కిరువైపులా పొదలు – మన స్వాతంత్ర్య మాతను రేప్ చేస్తున్న అదికార అవినీతి అహంకార వృక్షాల్లా వున్నాయి

ఎస్ ఐ పులికోసం మాటువేసిన వేటగానిలా కూచున్నాడు అతని చూపు బలుసుముళ్ళలా వుంది పిస్టల్ పట్టుకొన్న అతని కుడిచేయి నా ప్రక్కటెముకలకు తగిలినప్పుడల్లా నా భార్యాపిల్లలు గుర్తొస్తున్నారు

వెనుక – పోలీసులు ఎర్రని దుమ్ములోకి మొహాలుపెట్టి రోషగాళ్ళలా కూచున్నారు పోలింగ్ సిబ్బందీ – నాలానే

జీప్‌లో మౌనం తీతువులా అరుస్తూంది అందరి ఆలోచనలూ ఆపదలకేసి దూసుకపోతున్నాయి ఆపదమొక్కులవాడ్ని గుర్తుకు తెచ్చుకొంటూ గుండెలో అడవి గొర్రెలా గెంతుతున్న భయాన్ని అదుపులోకి తెచ్చుకోసాగాను

ఆ రాడికల్స్ ఏం చేస్తారో ఏవోగాని ఈ ఎస్ ఐ మాత్రం నన్నూ నా సిబ్బందినీ భయం పాతరలో కుక్కేస్తున్నాడనిపించింది తన ఆధిక్యతను ప్రదర్శించడంకోసం మమ్మల్ని ఎద్దేవాల్ని చేయడంలేదుగదా! అనికూడా అనిపించింది అలూ – చూలూ లేకుండానే పిల్లాడికోసం జోలపాట నేర్చుకొంటున్నట్టుగా వుందతని వ్యవహారం

ఇంకెంత దూరం? అంటూ – నా పోలింగ్ సిబ్బందిలోని ఓ స్పార్టకస్ మౌనం మొహం పగిలేలా గొప్ప కరాటే దెబ్బకొట్టాడు

ఊహించని ఆ దెబ్బకు అందరి గొంతుకలపై కాలేసి నిలుచున్న మౌనం గిజగిజలాడింది

ఇప్పుడెక్కడ? మామకన్ను చేరేందుకే మరో గంటపడుతుంది అక్కడాగాలి మరో పోలింగాఫీసర్

నో నో ఎలక్షన్ మెన్ అండ్ మెటీరియల్ ఎక్కడా ఆక్కూడదు రూలుంది

తెలుసా?

రయిటే కాని మనం స్పెషల్ మామకన్ను ఎ ఎ ఎస్ ఎ క్యాంప్ నుండి రిటర్నింగ్ ఆఫీసర్‌కి మెసేజ్ యివ్వాల

మామకన్నెంత దూరం?

అత్తకన్ను కావల ఐదు మైళ్ళు అత్తకన్నో పాతిక

ఆ! నా టి ఏ మైలేజిలో మొత్తం ముప్పయి చూపించి అరవై రూపాయలిచ్చు(న ఓ పోలింగాపీసర్

మనదీ డిటో గురూ యాడ ఎల్లాందు ! ఎంతలేదన్నా రెండొందలకి తక్కువ రావనుకున్న మా చిన్నోడి ట్యూషన్ ఫీజు గండం గడిచిందను కొన్న ప్ప మరొకతను

రెవెన్యూ మాయలంతే గురూ గోదావరికి వరదలొచ్చినా, దేశానికి ఎన్నికలొచ్చినా వాళ్ళబతుకు మూడు బార్లూ ఆరు కోళ్ళూ

అవ్‌నవును, ఆడిట్‌లేని బడ్జెట్ లోకల్ పర్చేజెస్ పేరుతో కూడబెట్టే డబ్బు లక్షల్లో వుంటుంది

ఎన్నికలంటేనే డబ్బు కోట్లాది రూపాయలు ఏట్లోపోసే తతంగం మాట కలుపుతూ అన్నాను

ఎస్ ఐ నాకేసి అదోలా చూశాడు

ఆ చూపుకు జవాబుగా కాదంటారా? ఈ డబ్బున్న వాళ్ళంతా డబ్బుమీద తప్ప మరే విలువలమీద నమ్మకంలేని వాళ్ళంతా డబ్బుతో కొన్న సీటుని డబ్బుతో గెల్చుకొని ప్రజల పక్షంగా ఆలోచిస్తారంటే - మీరు నమ్ముతున్నారా? నా స్వరంలో ఆవేశం!

మన స్వాతంత్ర్యం నాలుగోపడిలో పడినా ప్రజాసామ్యం ఎన్నికలు అనే పదాల నిజమైన ఉన్నతమైన బావాలను ప్రజలచెంతకు చేర్చకుండా మాటల మాయలతో అదికార పీఠాలెక్కి కులుకుతున్న పార్టీల మొహంమీద ఉమ్మేయాలన్నంతగా ఆవేశం!

దొడ్డిదారి పైరవీలూ దౌర్జన్యాలూ - రాజకీయాలకు ప్రతీకలై బ్రతుకుదెరువులై దేశంలోని ప్రతిబనూ న్యాయాన్నీ నైతిక స్థాయినీ నిర్దయగా సమాదిచేస్తున్న రాజకీయుల పుర్రెల్ని నిలువుగా పగలగొట్టాలన్నంతగా ఆవేశం!

అఫ్‌కోర్స్ నాయకుల వీక్‌నెస్‌ని ఎన్నికలకు ఆపాదిస్తే ఎలా? మంచి నాయకుడ్ని ఎన్నుకోవాలి ఎస్ ఐ అన్నాడేగాని చూపు నామీద లేదు పొదలమాటున కుందేళ్ళకోసం వెతుకుతున్న బోయవానిలా అడవిలోకి చూస్తున్నాడు

అసాధ్యం మన రాజ్యాంగంలోనే డబ్బున్న వారి ఆదిక్యతను కాపాడేందుకు బ్రహ్మాండమైన కుట్రసాగింది ఎన్ని సవరణలు జరిగినా మూలరాయిని కదల్చకుండానే ఏడుపులాటి నవ్వును పెదాలపై ఆడిస్తూ అన్నాను

అవున్సార్ మండల ఎన్నికల్లో ఓటుకు వంద దర పలికింది మా వూళ్ళో వెనుకనుంచి వొక పోలీస్

సహకార సంఘ ఎన్నికల్లో మాత్రం ఏ ఊళ్ళో చూసినా - రిగ్గింగ్ రైడింగ్ స్పార్క్‌స్


వినండి మన ప్రజాసామ్యం చెవిలో పువ్వున్నోడు తప్ప దీన్నెవరూ ప్రజాసామ్యం అనరు ఈ ప్రజాసామ్యం కోసం కోట్లాది దనం తగలేసేబదులు - సీటు కింత రేటో వేలం పాటో ఎడితేపోలే అన్నాను

ఎస్ ఐ నోరు తెరిచాడుగాని సడన్ బ్రేకుతో జీప్ ఆగేసరికి అందరిలానే ఎగిరిపడి పైగా వులికిపాటుతో డ్రయివర్ని చూస్తూ ఏమయింది? అన్నాడు

విల్ మార్చుకోవాలి సాబ్ డ్రయివర్ నింపాదిగా అన్నాడు

సన్నని మలుపు మలుపు తిరుగుతూనే యిసుకవాగు!

ఎస్ ఐ అడవి గర్భాన్ని చీల్చే చ పులతో



కంగారుగా చుట్టూ చూడసాగాడు

ఇప్పుడేమయింది సార్ మరీ అంత కంగారు అన్నాను

చెప్పలేం పరిస్థితి ఎలా వుంటుందో ఏదైనా జరిగితే అటు అదికారులూ యిటు రాడికల్సూ హాయిగా వుంటారు మాకైతే ఎంక్వయిరీలూ సస్పెన్షన్లూ ఛీ ఛీ ఈ పోలీసు బతుక్కంటే పుట్నాలమ్ముకుంటే గౌరవంగా వుంటుంది ఎస్ ఐ ఎటో చూస్తూ అన్నాడు

ఏం చేస్తారేమిటి రాడికల్స్?

ఎమైనా మనమీద దాడి కూడా

మాకా దే ముంది బూడిద వెనుక నున్నతను జోక్‌వేశాననుకొని తనే ముందుగా నవ్వాడుగాని వేరెవరూ నవ్వలేదు

జీప్ యిసు వాగులో కీచురాయిలా అరుస్తూ సాగుతూంది

వాగు కిరువైపులా నే నెన్నడూ చూడని ఎత్తైన చెట్లు ఎచ్చవనాన్ని కప్పుకొని రంగురంగుల పూల కొప్పులతో నిండైన చెట్లు చల్లనిగాలితో గుసగుస ఊసులు ఊయల లూగుతున్న చెట్లు

ఈపచ్చ చక్కని చల్లని చెట్లేనా? ఎర్రెర్రని జెండాలకు ఆశ్రయమిస్తున్నవి? యువశక్తిని మరణాల మెట్లపైకి నడిపిస్తున్నవి? మేధావుల మనసుల్లో నిరాశల నిట్టూర్పులు నింపుతున్నవి?

ఇసుకవాగు దాటాక–

చిక్కని అడవిలో – ఎగుడుదిగుళ్ళలో మా జీప్ – గాలిలోనో అగాధంలోనో తప్ప భూమ్మీద వున్నట్టుగా లేదు

ఎవడి పెళ్ళికీ కుదుపు వూరేగింపు? నా స్పార్టకస్!

ఎవరు గెలుస్తారని మీ అంచనా? ఎస్ ఐ

నాతో చిరాకు పొదలో చిక్కుకొన్న దుప్పిలా గింజుతూంది ఏవరైతేనేం ఒక్కొక్క డో ప్రజాస్వామ్య హంతకుడు టక్కున అన్నాను

కుందేల్ కుందేలీ వెనుకనున్నో పోలీసు

కొట్టనా సార్ రాత్రికి పనికొస్తుంది మరోతను ఏయ్ బుల్లెట్ – ఎకౌంటే మనిస్తావ్? ఎస్ ఐ

నోరూరిన పోలీసులు నీళ్ళు నమిలారు

జీప్ మరో గంట సాగి మామకన్నులో ఆగి – ఎ ఎస్ ఎ క్యాంపు నుండి రిటర్నింగ్ ఆఫీసర్‌కి వైర్‌లెస్ మెసేజ్ యిచ్చి అడవికొమ్ము చేరేసరికి సాయంత్రం నాలుగయింది

## 2

అడవికొమ్ము – అడవికొమ్మన తేమ అడవి గర్భంలో దాగున్నట్టుగా వుంది చుట్టూ పొట్టి గుట్టలూ దట్టమైన చెట్లూ చెట్ల మధ్యన పిచ్చుగూళ్ళలా – మా బీర గుడిసెలు!

ఇదా పోలింగ్ బూత్? గుడిసెకాదు పందిరీకాదు పందిరిపై టేకు కొమ్మలు నీడగా వుంచారు చుట్టూ గాలి తడికె!

ఇక్కడెలా? ఎవరు దిక్కు?

దూరదూరంగా కొందరు పెద్దలు నిలుచున్నారు కోరమీసానికి గోచి మాత్రమే అలంకారంగా వుంది మమ్మల్ని వెలేసినట్టుగా వారి చూపులు!

బుజాలపై గన్స్‌తో పోలీసులు గస్తీ తిరుగుతున్నారు ఎస్ ఐ జనం మధ్యలో మృగంలా అదోలా అనుమానపు చూపులు చూస్తున్నాడు

మా దగ్గరకు రాని పెదలకేసి నడిచాను తాతా యిక్కడ షేక్‌సింగ్ లేడా? అన్నాను

ఉండు వొత్తడుండు అడ్వీన రొట్టకి బొయిందు కడ్పులకి సూస్కోవాల్నా – వొద్దా యీ వొట్టంబలి పోస్తయా నిర్దయగా చూస్తూ నిర్మొహంగా అన్నాడా తాత!

దుమ్ములో పొరేగుతూ వచ్చిన న సిబ్బంది దిగుడుబావి దగ్గర స్నానం చేస్తున్నారు

ఇక్కడ తిండీ తిప్పలూ దారిపొడవునా పులలా కన్పించిన ఎస్ ఐ ఎలి లా గొణిగాడు

నా మనసు తిండీ – తిప్పలేకదు ఏ గొడవా లేకుండా బయటపడాలని ఆలోచిస్తూంది

దొరా పెడత దణ్ణం ఒకతను చేతులు జోడిస్తూ దగ్గరగా వస్తూ అన్నాడు

మనిషి చాలా చాలా బలహీనంగా వున్నాడు వయసు మన ప్రజాస్వామ్య మంత వుండొచ్చు

షేక్‌సింగ్‌ని దొరా నా చూపుకు జవాబుగా అన్నాడు

నిట్టూర్పొకటి విడుస్తూ వచ్చావా? అన్నాను అన్నానేగాని అతనికి పనిచెప్పడానికి నోరు రాలేదు పాలుగారే వయసులో తప్ప మిగతా కాలమంతా రోగాలతో గడిచినట్టుగా వుందతని రూపు! చూపులో వెట్టిచాకిరికి అలవాటుపడిన లక్షణా లున్నాయి

అతనికి చెప్పాల్సిన పనులన్నీ కాక చెప్పకతప్పని పనులు చెప్పి నా పనుల్లోకి పోయాను

* * *

రాత్రి ఎనిమిదయింది

ఆకాశంలో చుక్కల వెలుగూ అక్కడక్కడ నెగడు వెలుగూ తప్ప కిర్సనాయిల్ వెలుగు మచ్చుకైనా కన్పించటంలేదు

ఈ మధ్యలో ఆ వూరి పరిస్థితిని కొంత వరకు తెలుసుకోగలిగాను ఆ ఊరి చుట్టు ప్రక్కలా ఉన్న రెండు వందల ఎకరాల సాగుభూమి ఒక భూస్వామిదే! అతను తన కూతుర్ని నైజాం నవాబుగారి కప్పజెప్పి ఇనాంగా ఆ భూమిని సంపాయించాడట! సంపాయించాడేగాని యిరవై ఏళ్ళుగా– అతను హైదరాబాద్‌లోనే వుంటున్నాడు ప్రస్తుతం అతని గుమాస్తాలే అతనిలా జులుం చెలాయిస్తూ ఆ ఊరి శ్రమను దోచేస్తున్నారు

షేక్‌సింగ్ పందిరి ప్రక్కగ నెగడు వేశాడు అంచరంలో కాబిరామాయణంలో మునిగిపోయాం పోలీసులేదో చెపుతుంటే నవ్వు నే మేము– ఓ అగంతకుని రాకతో ఉలిక్కిపడ్డాము

అగంతకుడు నెగడు దగ్గరగా రాలేదు దూరంగా చీకటిలోనే నిల్చుని ఇటురాండి మాస్టారూ అన్నాడు గడుసుగా

ఎవరూ? పొన్నుగర్రలా నిల్చుని గస్తీ చూపుతో అన్నాడో పోలీసు అప్పటికే యస్ ఐ గురక తీస్తున్నాడు స్వచ్ఛమైన యిప్పసారా పట్టించాక అతను బాధ్యతలన్నీ విప్పేసి పందిరి గుంజకు తగిలించి నిద్రలోకి జారిపోయాడు

నిన్నుకాదు ప్రిసైడింగాఫీసర్ని! అగంతకుడు గదమాయింపు స్వరంతో అన్నాడు

ఉలిక్కిపడ్డాను నేనా? నాతో నీకేం పని? పైకి కాదు లోలో అనుకొని పోలీసుకేసి చూస్తూ చీకటిలోకి నడిచాను


రెండు చేతులా నమస్కరిస్తూ ఆ అగంతకుడు కరుకు స్వరంతో మాస్టారూ అన్నలొచ్చి మీతో మాట్లాడతరు అన్నాడు

అన్నలా? నాలో లోలో ఉలికిపాటు

అవును మీరు రమ్మంటే వస్తరు

రమ్మంటే ఏం జరుగునో కాదంటే ఏ కొంప మునుగునో న గొంతు తడారి పోతున్నట్టుగా వుంది

ఒకటీ రెండు నిముషాలు గడిచాక ఆ అగంతకుడు నాకేసి అదోల చూసి మాస్టారూ అన్నలు రరుగాని ఓ మాట యిక్కడున్న ఓట్లన్నీ పోలవుతాయి ఎవరొచ్చి ఓటేశారో ఎవరెయ్యలేదో మీ కనవసరం మా ఎజెంట్ చెప్పినట్లు వినండి అతి తెలివిని ప్రదర్శించారో హెచ్చరికలాటి సలహాను నా మొహానేసి చీకటిలో కలిసిపోయాడు అగంతకుడు



# పిల్లిమొగ్గలు

నా మనస్సు మొద్దుబారి పోయింది కాళ్ళకింద కదలికలు చీకటిలోకి చూస్తూ నిలుచున్నాను

దొరా ఆ వచ్చినాయన పెద్దన్న షేక్‌సింగ్

నా వళ్ళు జలదరించింది పెద్దన్న గురించి పేపర్ చదివే వాళ్ళకు చాలా తెలుసు నా గుండెలపై గోటి దెబ్బలు!

బయమెందుకు సార్? ఇక్కడెవరు మనకి దిక్కు? వాళ్ళే రూలంటూ ఆలోచిస్తే పెళ్ళాం ఎల్లలకి దూరం కావడం తప్ప వొరిగేదేమీ వుండదు నీ నీతీ న్యాయం విద్యుక్తదర్మం- యీ దేశంలో - సముద్రంలో కాకిరెట్ట ఓ పోలింగాఫీసర్ తాపీగా అన్నాడు

అందరూ అతన్ని బలపరిచారు, పోలీసులతో సహా

మన రాజ్యాంగాన్ని మనం రక్షించుకోవద్దా? మన ప్రజా స్వామ్యానికి మనంగదా పట్టు కొమ్మలం ఇంత ఖర్చు ఇంత తతంగమూ ఒకే ఒక బెదిరింపుకు తలొంచడమేనా?- నా ఆలోచ నలు- నాకు నిద్రను కరువు చేశాయి తప్ప మిగిలిందేమీ కన్పించలేదు

## 3

కుక్కి మంచాలు కుర్చీలుగా పీట చెక్కలే బల్లలుగా ఎన్నికల కార్యక్రమాన్ని అరంభించాము పోటీలో నున్న అబ్యర్థుల ఓటర్ల వివరాలు అట్టలపై వ్రాస పందిరి గుంజకు తగిలించాము

రహస్యంగా ముద్రవేసేందుకు మా దుప్పట్లతో చాటు చేశాము అభ్యర్థుల అక్షర క్రమంలో సూర్యుడు మొదటి గుర్తు గాకుండ గుర్తు చివరగా నున్న బాలెట్ పేపర్‌పై సంతకాలు చేస పోలింగాఫీసర్ దగ్గరుంచాను

అరుగురు అభ్యర్థులు రంగంలో వున్నా అందరి పక్షంగా ఏజెంట్లు రాలేదు సూర్యుని పక్షంగా ఒకతను వొచ్చాడు పేరు రామన్న

ఓటింగ్ అరంభమై గంట గడిచినా ఓటరెవరూ రాలేదు పోలీసులు అడవి తేనెకోసం ఆరాతీస్తున్నారు షేక్‌సింగ్ స్వచ్ఛమైన మేకపాలు తెచ్చిచ్చాడు రాత్రి పీకలదాకా తాగిన యస్ ఐ ఏమెరగని ఎల్లిపాయలా కూచున్నాడు నిన్నటి పయనంలో అతను చేసన హంగామా గుర్తొచ్చి నిన్న భలే అదరగొట్టారు సార్

ఎన్నికలంటే అంతే మాస్టారూ కొండంత రాగం తీస పిచ్చుకుంట పాట పాడినట్టు మనమేకాదు నెంబర్‌వన్ ఆఫీసర్లయినా అంతే నిజం చెప్పనా? ఇవన్నీ పిల్లి మొగ్గలు జనాన్ని జో జో కొట్టడానికి అని వెకిలిగా నవ్వాడు అతని మొహంలానే- నవ్వునా మచ్చలే!!

చలాకిగా ఉన్న ఒకతను- ఓ గుంపును వెంటేసుక వచ్చాడు చేతలోని బీడి దూరంగా విసరేస్తూ రామన్నా మా గుంపంతా వొచ్చింది లెక్కేసుకో మీ పార్టీ ఇచ్చిన పైకానికి సరిపోయిన్రో లేదో సూసుకో రేపు మొహం మొహం మాసుకోవాల్సిన వాళ్ళం పేచీలొద్దు అని బయట నిలుచున్న జనంతో- వొర్స వొర్సల రావాల ఇదేవన్న పగిడిద్దెరాజు తిరనాలనుకున్రా ఏంది? ఓట్లు అంటూ తన ఆధిక్యతను చాటుకోసాగాడు

ఓటర్ల జాబితాను బట్టి వచ్చిన వ్యక్తిని సరిజూస చూపుడు వ్రేలు పై చుక్క పెట్టి దుప్పటి చాటు కెళ్ళి నీ యిష్టమైన బొమ్మమీద ముద్రేస దీన్నిలా మడిచి తీసుకరా బాలెట్ పేపర్‌తో పాటు స్టాంపు చేతికిస్తూ వివరిస్తున్నాడు నా పోలింగాఫీసర్

బయటనున్న ఒకతను- ముద్రేసే వాళ్ళకు వినపడేలా- మొదటి బొమ్మ పై బొమ్మ మనది అద్నే ముద్రెయ్యాల అరుస్తున్నాడు

చట్టం ప్రకారం పోలింగ్ స్టేషన్ చుట్టు ప్రక్కలా ఏ విధమైన ప్రచారాన్నీ అనుమతించ కూడదు కాని నేనేం చేయగలను?

ఈ అడవిలో మాకు బద్రతేది? చట్టమో మరేదో అంటూ ప్రాణాలు మీదకు తెచ్చుకునే అవసరం నాకేమీ కన్పించలేదు!

ఎవడు గెలిస్తే నాకేం? నాయీ సువిశాల దేశాన్ని సంపన్నం చేయడానికి ఏ పార్టీ ఏ నాయకుని దగ్గరా సరైన ప్రణాళికగానీ పోనీ- కనీసం చిత్తశుద్ధిగాని లేదు కుంభకోణాలు మధ్య కృశించి పోతున్న దేశం నాది!

ఒక్కొక్కరే ఓటేస పోతున్నారు పందిరి గుంజకు వ్రేలాడేసన లౌడ్‌స్పీకర్‌లా బయట నున్నతను- పై బొమ్మ మనది అద్నే ముద్ర అరుస్తున్నాడు

సాయంత్ర మయింది చాలామంది ఓటేశారు ఎటు వారటు పోతున్నారు ఇంతలో ఓ నడివయసు స్త్రీ వచ్చింది అమె పేరు చూస చూపుడు వ్రేలుపై చుక్క పెట్టి బాలెట్ పేప రందించాక తీసుకొని దుప్పటి చాటుకెళ్ళింది

ఇంకెవరైనా వస్తారేమోనని చూస్తున్నాను ఛాలా వరకు ఓట్లు పోలయ్యాయి పోలీసులు పరికపళ్ళు తింటూ నిలుచున్నారు బయటి నున్నవారు తీవిగా బీడి తాగుతున్నారు ఏజెంటు మొహంలో వెయ్యి విద్యుద్దీపాలు!

వామ్మో వామ్మో ఓరీళ్ళు మాయల్ని మెకందిన ఈళ్ళకేం పొయ్యేకాలమొచ్చిందిరో ఓరన్నో ఈ ఓట్లు దగామారి ఓట్లురో అంటూ దుప్పటి చాటు నుండి యీవలకొచ్చిందా స్త్రీ!

నేనేకాదు అందరమూ ఉలిక్కిపడ్డాము

ఏమయిందమ్మా? అంటూ దగ్గరగా వెళ్ళిన నన్ను నెట్టేస ఆ స్త్రీ- రామన్న దగ్గరగా వెళ్ళి ఏం జెప్పన్రా- రామన్నా ఈ తెల్లగుడ్డలోళ్ళని నమ్మగూడదురా యీ కాయితంల సూరీడు లేడురా వామ్మో వాయ్యో యింకిటిందర్ని మాయ జేస్రో అంటూ బాలెట్ పేపర్ చూపించింది

అమె చేతిలో బేలెట్ పేపర్ తలక్రిందుగా వుంది బొమ్మలతో ఏర్పడే ప్రజా ప్రభుత్వంలో బొమ్మలు తలక్రిందులైతే ? అనుమానంలేదు- అది-బొమ్మ ప్రభుత్వం! అది బొమ్మ ప్రజాస్వామ్యం!!

అమె పట్టుకున్న రీతిలో పై నున్న బొమ్మ - బోర్లించిన కుండ అయితే పోలయిన ఓట్లన్నీ ? బయటనున్నతనూ ఏజెంటూ వొకరి మొహం ఒకరు చూసుకొంటున్నారు ఆ మొహాలు తెల్లగా వున్నాయి

నాలో ఏ భావమూ లేదు ఎవడు గెలిస్తే నాకేం? ఒక్కొక్కడో ప్రజాస్వామ్య హంతకుడు! ●

## సర్కస్ కళాకారులపై అజీజ్ టి.వి.చిత్రం



బుల్లి తెరపై కనిపించే దనిక- పేద వర్గాల చాంపియన్ అయిన అజీజ్ మిర్జా సర్కస్ కళాకారుల పైన ఒక సీరియల్ తీయాలని ప్లాన్ చేస్తున్నాడట 26 బాగాల ఈ సీరియల్‌ను తీసేందుకు తన టీమ్‌తో నిర్విరామంగా చర్చిస్తున్నాడు అజీజ్ గతంలో టి వి లో ప్రసారమైన నుక్కడ్ మనోరంజన్‌లు వాస్తవ జీవితాల ఆధారంగా నిర్మింపబడినవే అదే విధంగా సర్కస్ కళాకారుల గాథలను కళ్ళకు కట్టినట్లు చూపించేందుకు శోక శృంగార రసాల సమ్మేళనంతో ఈ సీరియల్ రూపొందిస్తున్నారు

నుక్కడ్ మనోరంజన్ ఎంత నవ్వించాయో ఈ సీరియల్ అంత కంట తడి పెట్టిస్తుందట